క్లుప్తంగా

మురుగుకాల్వలు నిర్మించండి



వడ్డెరకాలనీలో
మురుగుకాల్వలు లేని దృశ్యం

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్‌లో మురుగుకాల్వలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని వడ్డెరకాలనిలో షాబాద్ వెంకటేశం ఇంటి వద్ద సీసీరోడ్డు నిర్మించారు. కానీ మురుగుకాల్వలు నిర్మించపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. మురుగు కారణంగా పందులు స్వైర్య విహారం చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగుకాల్వలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు

దౌల్తాబాద్: మండలంలోని అంతారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఘనంగా స్వయం పాలనదినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఇందులో డీఈఓగా శిరీష, డిప్యూటీ డీఈఓగా దీక్షిత, ఎంఈఓగా అశ్విని, హెచ్ఎంగా మనెమ్మ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లోకేష్, ఉపాధ్యాయులు ఆశమ్మ, నర్సింలు, యామిని తదితరులున్నారు.

అందుబాటులో ఎక్స్‌రే సేవలు



ఎక్స్‌రేను ప్రారంభిస్తున్న వైద్యులు

కొడంగల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌రే సేవలు అందుబాటులోకి వచ్చాయి. బుధవారం ఆస్పత్రి సిబ్బంది ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు. గతంలో ఇక్కడ ఉన్న ఎక్స్‌రే మిషన్ కొన్నేళ్లుగా పని చేయడం లేదు. దీంతో కొత్త ఎక్స్‌రే మిషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



వాలీబాల్ కిట్లను అందజేస్తున్న
వినోద్‌కుమార్‌నాయక్ తదితరులు

కుల్కచర్ల: క్రీడాకారులకు అండగా ఉంటామని బండమీది తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం తుపాకుల తండాలో యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని గిరిజన తండాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగనున్నాయని పేర్కొన్నారు. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో సైతం మారుమూల ప్రాంతాల అభ్యున్నతికి ప్రత్యేకంగా కృషి చేయనున్నారని వివరించారు. గ్రామీణ యువతకు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించేందుకు ప్రోత్సహకాలను కల్పించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, దశరత్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ నేడు తలపెట్టిన ‘చలో హైదరాబాద్’ కార్యక్రమాన్ని పంచాయతీ ఉద్యోగ, కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా మోసం చేసిందన్నారు. గత ఏడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మిక కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కొలువుదీరిన వంద రోజులు గడుస్తున్నా, కార్మికుల సమస్యలు తీర్చకపోవడంతో చలో హైదరాబాద్ పిలుపునిచ్చినట్లు చెప్పారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలు చెల్లించడంతో పాటు సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు.

బాగుచేస్తేనే.. సాగు నీరు!

- మరమ్మతులకు నోచుకోని జుంటుపల్లి ప్రాజెక్టు కాల్వలు, తూములు
- చివరి ఆయకట్టుకు నీరందక రైతుల్లో నైరాశ్యం



యాలాల: దెబ్బతిన్న ప్రాజెక్టు తూము



యాలాల: జుంటుపల్లి ప్రాజెక్టు

యాలాల: తాండూరు నియోజకవర్గంలో అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు జుంటుపల్లి. అభివృద్ధికి నోచుకోక చివరి ఆయకట్టుకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వర్షాకాలంలో దెబ్బతిన్న తూముల నుంచి వరదనీరు వృథాగా పోతోంది. దీనికితోడు చివరి పొలాల వరకు ఉన్న కాల్వలు పూర్తిగా దెబ్బతినడంతో పంట సాగు కష్టమవుతుంది. ఈ విషయంలో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారైన ప్రాజెక్టు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

2200 ఎకరాల ఆయకట్టు!

జుంటుపల్లి ప్రాజెక్టు నీటి సామర్థ్యం 22 అడుగులు. దీని కింద సుమారు 2200 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు దిగువన పగిడిపల్లి, జుంటుపల్లి, అక్కంపల్లి, చెన్నారం, పేర్కంపల్లి, పేర్కంపల్లితండా, ఎన్కెపల్లి తదితర గ్రామాలకు చెందిన సాగు భూములున్నాయి. గతంలో ప్రాజెక్టు అభివృద్ధి పనులకు అప్పటి ప్రభుత్వం నిధుల కేటాయించినప్పటికీ, పలు కారణాల వల్ల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఇటీవల రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో, ఈసారైన ప్రాజెక్టు అభివృద్ధి పనులు పూర్తి చేస్తారనే నమ్మకంతో రైతాంగం ఆశపెట్టుకుంది.

రూ.9 కోట్ల పనులతో నివేదికలు

ప్రాజెక్టు అభివృద్ధిలోకాల్వల మరమ్మతు పనులు చాలా ముఖ్యమైనవి. ఏళ్ల క్రితం నిర్మించి వదలడంతో చాలా చోట్ల శిథిలావస్థలోకి చేరాయి. కాల్వల సైడ్ వాల్స్, గ్రౌండ్ బెడ్, ముళ్ల కంపలు పెరగడంతో నీరు దిగువకు పారడం లేదు. ప్రతి వర్షాకాలంలో అలుగు పారుతుండటంతో దిగువన ఉన్న ప్రాంతం పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో పొలాలకు వెళ్లేందుకు రైతుల కోసం ఏర్పాటు చేసిన క్రాసింగ్ బ్రిడ్జి కూడా ధ్వంసమైంది. వీటితో పాటు గతంలో ప్రాజెక్టు రెండు తూములు పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థలోకి చేరాయి. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు కాల్వ, తూముల అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయాలని భావిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ప్రాజెక్టు అభివృద్ధి పనులకు ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రాజెక్టులో ముఖ్యంగా కాల్వ మరమ్మతు పనులు, తూముల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించాం. ఇందుకుగాను రూ.9 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరయితేనే టెండరు వేసి పనులు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

– కిష్టయ్య, ఇరిగేషన్ డీఈ తాండూరు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా

యాలాల: ఎండలు మండుతున్నాయి.. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా వ్యవసాయ శాఖకు సంబంధించిన వివరాలను ఏడీఏ రుద్రమూరి వివరించారు. యాసంగి రైతుబంధు వివరాలను అజెండా స్పష్టంగా ఎందుకు పేర్కొనలేదని కోకట్ ఎంపీటీసీ కరణం పురుషోత్తంరావు ప్రశ్నించారు. రైతుబంధుతో పాటు రైతుబీమా, పీఎం కిసాన్ తదితర లబ్ధిదారుల వివరాలు అసంపూర్తిగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖపై ఏఈ మాట్లాడుతూ.. మండలంలో పలుగ్రామాల్లో లూప్ లైన్లతో పాటు కొత్త స్తంభాలను ఏర్పాటు చేశామని సభకు తెలిపారు. ఈ విషయమై బెన్నూరు ఎంపీటీసీ లక్ష్మప్ప మాట్లాడుతూ.. బెన్నూరులో ఇనుప స్తంభాలతో ప్రమాదం పొంచి ఉన్న విషయాన్ని పలుమార్లు సభ దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేదన్నారు. రాఘవపూర్ సబ్‌స్టేషన్ నుంచి కోకట్ పంచాయతీకి కరెంటు సరఫరా జరగడం లేదని, ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని కరణం పురుషోత్తంరావు డిమాండ్ చేశారు. కాగా, ముద్దాయిపేటలో కొత్త పంచాయతీ భవనం వెంటనే పూర్తి చేసేలా చూడాలని ముద్దాయిపేట ఎంపీటీసీ దేవగారి రాములు సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పాటు మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటితో పాటు దోమల బెడద లేకుండా ఫాగింగ్ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్నసాగర్‌లో భగీరథ నీటిని ఇంటింటికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజలు ఇబ్బంది పడకుండా పకడ్బందీగా ఉంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుష్పలీల, డీటీ లక్ష్మణ్‌నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

చిన్నారుల ఆహారంపై అవగాహన

ధారూరు: ఆరు నెలల వయసు పూర్తయిన పిల్లలకు చనుబాలతో పాటు అదనపు పోషకాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని నాగసముందర్‌లో 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల వారికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్-2024 కార్యక్రమం నిర్వహించారు. బాల్యరంగ విద్యపై ప్రతిజ్ఞ చేసిన అనంతరం వికారాబాద్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 23 వరకు పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, తల్లి బిడ్డకు పాలు ఇవ్వడంలో సరియైన పద్ధతులు పాటించాలన్నారు. పోషకాహార ఆవశ్యకతను ఆమె వివరిస్తూ స్వదేశీ బొమ్మలను ప్రోత్సహించేందుకు విదేశీ బొమ్మలను నిషేధించాలని సూచించారు. స్వదేశీ బొమ్మల ప్రదర్శన చేయడం, తల్లులు, గర్భిణిల్లో రక్తహీనత తగ్గించడానికి తండాల్లో చిరుధాన్యాలు, సంప్రదాయ ఆహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు పోషకాహారం తీసుకునే విధానం, క్రమం తప్పకుండా ఏఎన్‌సీ పరీక్షలు చేయించుకోవడం మర్చిపోవద్దని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో నాటకీకరణ చేయించి అవగాహన కల్పించాలని టీచర్లకు చెప్పారు. కేంద్రాల వద్ద నీటి పరిరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద లర్నింగ్ కార్నర్‌లను ప్రత్యేకంగా ప్రచారం చేయాలని ఆమె టీచర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, చంద్రకళ, జగదీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

బడి బాధ్యత ఆమెదే..

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- చైర్‌పర్సన్‌గా గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు
- కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయుడు
- అమ్మ ఆదర్శ కమిటీల ఎన్నిక



మాటూరు ప్రాథమిక పాఠశాల

దౌల్తాబాద్: ప్రభుత్వ బడుల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ విధానంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీఓ జారీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట మహిళల పర్యవేక్షణ కొనసాగనుంది. తాగునీటి సౌకర్యాలు, మరమ్మతులు, తరగతి గదుల విద్యుద్దీకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, యూనిఫాంల కుట్టు బాధ్యతలు నిర్వహించనున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు కొలువుదీరనున్నాయి. గ్రామమహిళా సంఘం అధ్యక్షురాలు కమిటీకి చైర్‌పర్సన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వీరిద్దరికి జాయింట్ చెక్‌పవర్ ఇచ్చారు. ప్రతీ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉంటారు.

కాలపరిమితి రెండేళ్లు...

అమ్మ ఆదర్శ కమిటీలకు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరు, ఇతర కార్యక్రమాలు సమీక్షిస్తుంటారు. కమిటీకి రెండేళ్ల కాలపరిమితి ఉంటుంది. ప్రభుత్వం నిర్దేశించిన మేర కమిటీ ఎంపిక ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, మహిళ సంఘం అధ్యక్షురాలు చైర్మన్ పర్సన్‌గా , ఒకటి నుంచి పది వరకు ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున సభ్యులుగా ఉంటారు. రూ.25వేల పనుల వరకు టెండర్ లేకుండా అంతకుమించి ఉంటే కమిటీలు జిల్లా సమాఖ్యల ద్వారా కలెక్టరుకు నివేదిస్తాయి. లక్ష దాటితే కలెక్టరు పర్యవేక్షణలో పనులు సాగనున్నాయి. పనులు పూర్తయ్యాయని ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరిస్తేనే బిల్లులు చెల్లిస్తారు.

అభివృద్ధికి సంఘాలు దోహదం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వం పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. పాఠశాలల అభివృద్ధికి సంఘాలు దోహదపడతాయి. ఈ కమిటీలు త్వరలో అన్ని పాఠశాల్లో ఏర్పాటు చేస్తాం.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్‌తేజ

అనంతగిరి: దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందని ఏబీవీపీ పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ తేజ అన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లోని తక్షశిల డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ‘పరిసర్ చలో అభియాన్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజు హాజరుకావడం వల్ల కళాశాలలో బహుళ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. విధిగా కళాశాలకు రావడంతో ప్రతి సబ్జెక్టుపై మంచి పట్టు లభిస్తుందని, భవిష్యత్తులో ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మంజునాధరెడ్డి, హరీశ్‌రావు, జగదీశ్‌చారి, అనిల్, అదికేశవ్‌రెడ్డి, కార్తీక్, రమేశ్, మహేశ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందాం

చేవెళ్ల: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అంతా కలిసి పనిచేద్దామని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీని మండలంలోని ఆలూరు గ్రామ కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు నగరంలోని ఎంపీ నివాసానికి వెళ్లి ఆయనను కలిసి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినందుకు స్వాగతం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. .కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంతరాములుగౌడ్, ఎంపీటీసీ నరేందర్, నాయకులు యాదిరెడ్డి, రాజు, రఫిక్‌షరీఫ్, నర్సింలు, వెంకటయ్య, ఆనందం, శంకరయ్య, మహేందర్, యూత్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, రాజు, ప్రశాంత్, శేఖర్, తదితరులు ఉన్నారు.



రంజిత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న
కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలకు నెరవేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు ఆకర్షితులై చాలా మంది వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రాబోవు ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పూర్తిగా ఖాళీ కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, విశాల, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, బాబర్‌ఖాన్, వెంకట్‌రాంరెడ్డి, జమృద్‌ఖాన్, కాశీనాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, మోహన్, శివశంకర్‌గౌడ్, భార్గవ్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన మెతుకు ఆనంద్ దంపతులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న
మాజీ ఎమ్మెల్యే ఆనంద్ దంపతులు

మర్పల్లి: మండల పరిధిలోని దామస్తాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మూసని బాబురెడ్డి, కుమారుడు మూసని చంద్రకాంత్‌రెడ్డి, భవాని వివాహం బుధవారం మెమిన్‌పేట్ మండలం బీజేఆర్ ఫంక్షన్‌హాల్లో జరిగింది. ఈ వివాహ వేడుకలకు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఆయన సతీమణి సబితానంద్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, దామస్తాపూర్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

పోస్టుమార్టం గది నిర్మాణం పూర్తి



నిర్మాణం పూర్తి అయిన పీఎమ్ గది

కొడంగల్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన పోస్టుమార్టం గది నిర్మాణం పూర్తి అయినట్లు వైద్య సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగంలోకి తీసుకువస్తే స్థానికంగా పోస్టుమార్టం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు స్పందించి పీఎం గదిని అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

షాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి అండగా ఉంటామని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవుల మల్లేశ్, నవనీత దంపతుల కుటుంబసభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.20వేల నగదు అందజేశారు. పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లల చదువులు, ఇతరత్రా ఖర్చులకు ఇబ్బందులు పడకుండా తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

లేబర్‌కార్డుతో లబ్ధి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ లేబర్‌కార్డులను పొందాలని జన్ సహస్ స్వచ్ఛంద సంస్థ నియోజకవర్గ కోఆర్డినేటర్ రవీంద్ర, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్షక, కార్మికులందరూ తప్పనిసరిగా లేబర్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేబర్‌కార్డు ఉండటం వల్ల ఎదైనా ప్రమాదం జరిగితే కేంద్ర ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. గర్భిణులకు ప్రసవ సమయంలో రూ. 30వేల ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. కావున భవన నిర్మాణ రంగంలో, అసంఘటిత రంగంలో పనిచేసే ప్రతి ఒక్క కార్మికుడు లేబర్‌కార్డును పొంది ఇన్సూరెన్స్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లేబర్‌కార్డులను లబ్ధిదారులకు
అందిస్తున్న ప్రతినిధులు

ఎన్నికల నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న
డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ, ఎస్ఐ

మర్పల్లి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి

మర్పల్లి: ఎన్నికల ప్రవర్తన నియమావళిని రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రతి ఒక్కరూ పాటించాలని మర్పల్లి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా సరిహద్దు మండల పరిధిలోని కొంషేట్‌పల్లి గ్రామం సరిహద్దు వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డులో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట్ సర్కిల్ సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సభలు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం వాహనాల్లో లేదా ఇతరాత్ర మార్గాల ద్వారా డబ్బులు తీసుకు వచ్చే వారు రూ. 50 వేల కంటే ఎక్కువ తీసుకుపోవద్దని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించాలన్నారు.

నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

చేవెళ్ల మండల సమావేశంలో
ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. వేసవి కాలంలో నీటి సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులతో కలిసి సమన్వయంగా పనిచేయాలని సూచించారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. ఏదైనా పెద్ద సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది కాబట్టి ప్రజలకు ఎంపీటీసీలు అందుబాటులో ఉండాలన్నారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు నీటి వసతి కల్పించాలని సూచించారు. మండల అభివృద్ధికి అంతా కలిసి పనిచేద్దామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారులు ఆయా గ్రామాల్లో ఉన్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కర్రె శివప్రసాద్, ఎంపీడీఓ హిమబిందు, ఎంఈఓ అక్బర్, సీడీపీఓ శోభారాణి, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి